క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు చేయని మిల్లులు సీజ్



జగ్గయ్యపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని మిల్లర్‌లు కొనుగోలు చేయకుంటే మిల్లులు సీజ్ చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ హెచ్చరించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధరకు మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. గ్రేడ్–1 రకం ధర రూ.1,740గా నిర్ణయించినట్లు తెలిపారు. మార్కెట్ యార్డు అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ కాకుండా మిల్లర్లు తేమశాతం ఎక్కువ ఉందని ఆంక్షలు పెడుతుండటంతో ప్రభుత్వ ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో పద్మావతి, వెంకటేశ్వర రైస్ మిల్లులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని లేకుంటే మిల్లులు సీజ్ చేస్తామని వాటి యాజమాన్యాలను హెచ్చరించారు. అనంతరం రైతులు పలు సమస్యలను ఆయనకు వివరించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టి తొలగింపు



నందిగామ రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి మునేటి బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టి, చెత్త తొలగింపు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిపై కొంతకాలంగా మట్టి పేరుకుపోవడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు రోడ్ల పక్కన చెత్తాచెదారాలు పడేయకుండా విధిగా చెత్త కుండీలను వినియోగించాలని ప్రజలను కోరారు.

బార్ అసోసియేషన్ సభ్యులకు సత్కారం



నందిగామటౌన్: నందిగామ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సిఎస్ఐ చర్చి సంఘానికి చెందిన న్యాయవాదులు గెలుపొందడం అభినందనీయమని రెవ. కెజెఎస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం న్యాయవాదులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్ అధ్యక్షుడిగా నంద్రు బాబువిద్యాసాగర్, జాయింట్ సెక్రటరీగా ఉప్పులూరు డేవిడ్‌రాజు, ఎగ్జిక్యూటివ్‌లుగా కస్తాల శ్రీచరణ్, దారెల్లి అరుణకుమార్ గెలుపొందడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బెజవాడ పుల్లయ్య, గుంటి వెంకటరత్నం, దగ్గుబాటి కమలాకర్, ఉప్పులూరి జవహర్‌బాబు, పెద్దసంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకక్షేత్రం వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం కనులపండువగా జరిగింది. ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి కేరళ డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. వర్షం కారణంగా రెండు గంటలు ఆలస్యంగా రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, ఆలయ ఏసీ ప్రసాద్, చైర్మన్ భరద్వాజ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కంచికచర్లలో ర్యాలీ

కంచికచర్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం కంచికచర్లలో ర్యాలీ నిర్వహించనున్నట్లు బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ నాయకులు బర్రె ఉదయ్‌కిరణ్, బహుజన రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని వారు కోరారు.

పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో తీవ్రజాప్యం

- పదిహేను రోజులుగా నిలిచిన పనులు
- పట్టించుకోని అధికారులు
- రావిరాల గ్రామస్తులకు తప్పని తాగునీటి కష్టాలు



అసంపూర్తిగా ఉన్న కృష్ణానదిలో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్ పనులు

రావిరాల(జగ్గయ్యపేట): మండలంలోని రావిరాల గ్రామం వద్ద కృష్ణానదిలో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులు పదిహేను రోజులుగా ముందుకు సాగడం లేదు. ఈ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

వరదలకు దెబ్బతిన్న పైపులైన్..

కృష్ణానదిలో బోరు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పైపులైన్ ద్వారా రావిరాల గ్రామస్తులకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. అయితే గతేడాది సెప్టెంబర్ నెలలో సంభవించిన వరదలకు రావిరాల గ్రామానికి తాగునీటిని అందించే పైపులైన్‌తోపాటు మోటార్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో రావిరాల గ్రామస్తులు తీవ్ర తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో కృష్ణానదిలో నీరు తగ్గడంతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. జిల్లా మైనింగ్ నిధులు రూ.7లక్షలతో నదిలో బోరు వేయడంతోపాటు 600 మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేసేలా గత నెలలో పనులు చేపట్టారు. అయితే ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పదిహేను రోజులుగా ఈ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడమే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికే వేసవి ఎండలు రోజురోజుకు పెరుగుతుండగా, పైపులైన్ పనుల్లో జాప్యం చోటుచేసుకుంటుండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని వారు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపరూ..

రావిరాల కృష్ణానది ఒడ్డున ఉండటంతో వరదల సమయంలో నదిలోని బోరు, పైపులైన్లు కొట్టుకుపోతున్నాయి. దీంతో ఆయా సమయాల్లో గ్రామస్తులకు మంచినీటి ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో 2009, 2011లో సంభవించిన వరదల సమయాల్లోనూ పైపులైన్ దెబ్బతింది. ఇలా వరదల సమయంలో బోరు, పైపులైన్లు దెబ్బతింటున్నందున ఈ సమస్యను శాశ్వత ప్రాదిపదికన పరిష్కరించాలని రావిరాల గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేస్తాం...

నదిలో పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేస్తాం. ఈ మేరకు కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. నిలిచిన పనులను రెండుమూడు రోజుల్లో ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేస్తాం.

– ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు : వేల్పుల



బెయిల్‌పై విడుదలైన కార్యకర్తలను పరామర్శిస్తున్న వేల్పుల రవికుమార్

పెనుగంచిప్రోలు: రాజకీయ కక్షతోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై అక్రమ కేసులు పెట్టారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ అన్నారు. గతనెలలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణ కేసులో బెయిల్‌పై విడుదలైన 10మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆదివారం రవికుమార్‌ను ఆయన ఇంటివద్ద కలిశారు. పార్టీ అండగా ఉంటుందని ఆయన వారికి ధైర్యం చెప్పారు. అనంతరం రవికుమార్ విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అమాయకులైన యువకులపై అక్రమంగా కేసు పెట్టడం తగదన్నారు. పోలీసులపై రాళ్లు విసిరిన అసలు నిందితులను వదిలిపెట్టి అమాయకులైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం క్షమించరాని నేరమన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల తీరుపై జాతీయ ఎస్సీ, బీసీ కమిషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, బీసీ నాయకులు ఓర్సు కొండలు, బత్తుల వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ‘బత్తుల’ పరామర్శ..



పెనుగంచిప్రోలులో పార్టీ కార్యకర్త చేని మహేష్‌ను పరామర్శిస్తున్న బత్తుల రామారావు, నాయకులు

పెనుగంచిప్రోలు: తిరునాళ్లలో ఘర్షణ కేసుకు సంబంధించి బెయిల్‌పై విడుదలైన వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లకు ఆపార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు ఆదివారం వెళ్లి, వారిని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు మెండెం రామారావు, నాయకులు నలబోతు నాగబాబు, వేముల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా రైతులంతా ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిరెడ్డి

కంచికచర్ల: పార్టీలకతీతంగా రైతులందరూ ఏకమైతేనే ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరిస్తాయని భారతీయ కిసాన్ సంఘ జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి పేర్కొన్నారు. కంచికచర్ల ఓసీ కల్యాణ మండపంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్ రైతుల కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేస్తోందన్నారు. రైతుల కోసం స్వామినాథన్ కమిషన్ సిపార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం దాములూరు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడు మండలంలో అడవి ఆవుల సమస్యను పరిష్కరించాలని, పేపర్ గుజ్జు పరిశ్రమను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు. కంచికచర్ల, వీరులపాడు మండలాలకు సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సమస్యను పరిష్కరించాలన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి డి.రాము మాట్లాడుతూ, రైతులు సమైక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పంట బీమా సదుపాయాన్ని రైతులకు కలిపించాలని డిమాండ్ చేశారు. భారతీయ కిసన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్ష్యులు అనుమోలు గాంధీ మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రైతుల సంఘమని వివరించారు. అనంతరం జిల్లా అధ్యక్ష్యులుగా కడియాల నరసింహారావు ఏకగ్రవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వేస్ట్ ఉడ్ సుబాబుల్ రైతు ఉత్పత్తిదారుల సంఘ చైర్మన్ రావూరి రమేష్, భరత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వెలది అంకమ్మకు బోనాలు

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామంలో వేంచేసియున్న వెలది అంకమ్మ తల్లి అమ్మవారి బోనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంకమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాలపొంగళ్లు తయారుచేసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలను సమర్పించారు. అనంతరం అడుగుమడుగులు కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన



పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు క్రమం తప్పకుండా తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బాలామృతం, ఆకుకూరలతో చపాతీ తయారీని వివరించారు. కౌమార దశలోని బాలికల సంరక్షకులతో సమావేశారం నిర్వహించి పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, విమల, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి, సునీత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలకు హాజరుకండి

నందిగామ రూరల్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9గంటలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహిస్తున్నట్లు నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ వేడుకలు నిర్వహించాలని సూచించారు.

వేడుకలు నిర్వహించాలని పిలుపు

జగ్గయ్యపేట అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించాలని సూచించారు.

పేదరిక నిర్మూలనకు శ్రీకారం : ఎంపీ



జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ శివనాథ్

జగ్గయ్యపేటఅర్బన్: డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆలోచనల స్ఫూర్తితో సమాజంలో పేదరికం నిర్మూలనకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని పీపీఆర్ గార్డెన్స్‌లో జయప్రద ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర పొలిటికల్ సెక్రటరీ టీడీ జనార్దన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎంపీ కేశినేని శివనాథ్, రాష్ట్ర వైద్యశాఖ మంత్రి వై.సత్యకుమార్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రారంభించారు. అనంతరం వైద్యపరీక్షలు చేయించుకున్నవారికి ఎంపీ శివనాథ్ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జయప్రద ఫౌండేషన్ సేవలను ఆయన కొనియాడారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, శంకర నేత్రర వైద్యాలయం సిబ్బంది డాక్టర్ రోహిత్, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి సెక్రటరీ వినయ్, విద్యాభారతి ఉపాధ్యక్షుడు వెలగపూడి రామకృష్ణ, జయప్రద ఫౌండేషన్ వైస్‌చైర్మన్ గౌతమిసరోజ, ఆపరేటివ్ ఆఫీసర్ చాముండేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



పేటలో ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న సంఘస్తులు



పొన్నవరంలో ఈత మట్టలతో ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



గండేపల్లిలో ర్యాలీ చేస్తున్న సంఘస్తులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో మ్రానికొమ్మల ఆదివారం (మట్టల ఆదివారం) వేడుకలను ఆదివారం పలు చర్చిలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సిఎం చర్చిలో ఫాదర్ గుడిసె జయరాజు, సెయింట్ థామస్ సిఎస్ఐ టౌన్ చర్చిలో డీనరీ చైర్మన్ ఎస్.పాల్‌రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈత మట్టలు ధరించి చర్చి ఆవరణలో ర్యాలీ చేశారు. విలియంపేట సిఎస్ఐ , క్రిస్టియన్‌పేటలోని సిఎస్ఐ చర్చి, బలుసుపాడు రోడ్డులోని బేతేలు, కోదాడ రోడ్డులోని బేతెస్థ, బలుసుపాడులోని సీఎస్ఐ, ఆర్‌సీఎం చర్చిలలో ఈత మట్టలకు పూలు అలంకరించి ప్రదర్శనలు నిర్వహించారు. ఫాదర్ కొరివి థామస్, చర్చిల డీనరీ చైర్మన్ దర్శన్‌సుందర్, గంటా ఆనందరావు, పాస్టర్ అభిలాష్, సంఘపెద్దలు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నందిగామతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఈతమట్టలతో గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీ చేస్తూ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఫాస్టర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తోటివారితో ప్రేమ, దయతో మెలగాలని సూచించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని కంచికచర్లలోని కంచికచర్ల సీఎస్ఐ చర్చి, ఆర్సీఎం చర్చిలతోపాటు మండలంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత మట్టలు, కొబ్బరి మట్టలను పూలతో అలంకరంచి ర్యాలీ చేశారు. సీఎస్ఐ పాస్టర్ కొండా స్టాలిన్, గండేపల్లి సర్పంచి కార్యక్రమంలో సర్పంచి రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: సమస్త మానవాళి రక్షణకే క్రీస్తు మరణమని పాస్టర్ జోసెఫ్‌పాల్ అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా గ్రామంలో ప్రార్థనలు చేశారు.జేజీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టలను చేబూని ర్యాలీ చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. వీరులపాడు, పొన్నవరం, బోడవాడ, జమ్మవరం, జగన్నాథపురం, వెల్లంకి తదితర అన్నిగ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈతమట్టలతో ర్యాలీ చేశారు. ఫాస్టర్ గొర్రెపాటి ఇమ్మానియేలు, సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, సతీష్, రెవ. ఫాదర్ సాలే వినయ్‌కుమార్, నాయకులు యాదాల సుజాత, నన్నేబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కర్ల రాణీ, రాజు, బండి విజయ్‌పాల్‌రెడ్డి, జ్ఞానారెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండలంలోని వత్సవాయి, మక్కపేట, చిట్టేల, భీమవరం, గోపినేనిపాలెంతోపాటు ఆయా గ్రామాల్లోని చర్చిలతో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత మట్టలను రంగురంగుల పూలతో అందంగా అలంకరించి గ్రామాల్లో ర్యాలీ చేశారు.

ముగిసిన సత్యమ్మ అమ్మవారి జాతర



ప్రత్యేకాలంకరణలో సత్యమ్మ అమ్మవారు

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్చకులు నందిగం సుబ్బారావు, కోటేశ్వరశాస్త్రి, టీటీడీ వేదపండితుడు దుర్భాకుల రఘునాథశర్మ ఆధ్వర్యంలో సత్యమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషఅర్చనలు, పూజలు చేశారు. తొలుత అమ్మవారికి కుంకుమార్చన, ఖడ్గమాల మూలమంత్ర హోమాది క్రతువులు, పూర్ణాహుతి పూజలను వేదోక్తంగా జరిపించారు. భక్తులకు భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దంపతులు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, నందిగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తంబళ్లపల్లి రమాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. పూజల అనంతరం శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఆయా పూజా కార్యక్రమాలను ఈఓ హరి గోపీనాథ్, ఉత్సవ కమిటీ సభ్యుడు మంచాల మాధవరావు పర్యవేక్షించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేకాలంకరణలో స్వామివార్లు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయం వారు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణం



గరుడాచలంలో స్వామివార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



పెనుగంచిప్రోలులో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గరుడాచలం(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వీరనారసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారు, స్వామి వారికి ఎదురుకోలోత్సవం నిర్వహించారు.కొండ కింద ఉన్న కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు అర్చకులు వేదాంతం శ్రీధరాచార్యులు, మురళీధరాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని వేదోక్తంగా జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయప్రాంగణంలో ఊరేగించారు. ఆలయాన్ని వంశపారంపర్య ధర్మకర్త ఈశ్వరప్రగడ శేషగిరిరావు, భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో ..

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణాన్ని శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం నారాయణాచార్యులు, బాల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వంశ పారంపర్య ధర్మకర్త, ఆలయ చైర్మన్ కొమరగిరి రఘురామారావు ఇంటి నుంచి మంగళ వాయిద్యాల నడుమముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ హరి దుర్గానాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి, శ్రీఅయ్యప్పసేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

నందిగామరూరల్: నందిగామ పట్టణంలో ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురుగాలులు వీచాయి. అప్పటివరకు భానుడు ఉగ్రరూపం దాల్చాడా అన్నట్లుగా ఎండవేడిమితోపాటు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వాతావరణం చల్లబడటంతో కొద్దిసేపు తీరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురుగాలులతోపాటు చిరుజల్లులు పడటంతో రైతులు ఆందోళన చెందారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మిర్చి, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు.

రోడ్లపై పారుతున్న మురుగు



మక్కపేట(వత్సవాయి): చిల్లకల్లు–వైరా రహదారిపై ఉన్న ప్రధాన గ్రామం మక్కపేట గాంధీసెంటర్‌లో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. డ్రైనేజీ కాల్వలు సజావుగా లేకపోవడంతో మురగంతా రోడ్లపైకి చేరుతోంది. రహదారికి ఇరుపక్కలా ఉన్న పలు రకాల వ్యాపారాలు చేసుకునేవారు సైడ్ కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పూడికతీసేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. దీంతో కాల్వలు పొంగిపొర్లుతూ మురుగంతా రోడ్లపైకి చేరుతుండటంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. బస్సులు, ఆటోల కోసం సెంటర్‌లో వేచిఉండే ప్రయాణికులు సైతం ఈ మురుగు కారణంగా వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని చెబుతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి సైడ్ కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించి, మురుగు నీరు సజావుగా పారేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.